# గీతోపనిషత్

(శ్రీమద్భగవద్గీత 17వ అధ్యాయము - శ్రద్ధాత్రయ విభాగ యోగము)

మాస్టర్ పార్వతీకుమార్


ధనిష్ఠ

# ధనిష్ఠ ప్రచురణలు


















ప్రతులకు : ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.

Phone : 0891-2701531    www.dhanishta.org    info@dhanishta.org

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంధకర్తవి, ప్రచురణకర్తవి.

# గీతోపనిషత్

(శ్రీమద్భగవద్గీత 17వ అధ్యాయము - శ్రద్ధాత్రయ విభాగ యోగము)

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

**గీతోపనిషత్** (శ్రద్ధాత్రయ విభాగ యోగము)

ప్రథమ ముద్రణ : 13-7-2022 ప్రతులు : 1,000
(శ్రీ శుభకృత్ - గురుపూర్ణిమ)

© ధనిష్ఠ ఫౌండేషన్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్, ఇండియా.

వెల : రూ|| **70-00**

ప్రతులకు :

**ధనిష్ఠ ఫౌండేషన్,**
15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,
కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.
ఫోన్ : 0891-2701531, 2509154.
website : www.dhanistha.org.
info@dhanistha.org.

ISBN : 978-81-957285-4-1

ముద్రణ :

**ఓం నమశ్శివాయ జెరాక్స్**
మహారాణిపేట, విశాఖపట్నం.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**“ధనిష్ఠ”** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు “ధనిష్ఠ” 1992లో జన్మించినది.

**“ధనిష్ఠ”** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**“ధనిష్ఠ”** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - “జగద్గురు మందిరము”గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో 34 సంవత్సరములుగా బోధనలు గావించుచూ, పరమ గురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్**గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే దానికి

సాఫల్యత, సార్థకత ఉండునని, *"మానవ సేవయే మాధవ సేవ"* అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియ పరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అష్టాంగ యోగము ననుష్ఠానము చేయుచు, వేలాదిమందితో అనుష్ఠింప చేయుచున్న యోగి. శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ**

# గీతోపనిషత్

(శ్రీమద్భగవద్గీత 17వ అధ్యాయము - శ్రద్ధాత్రయ విభాగ యోగము)

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| | ముందుమాట | ....... | 9 |
| 1. | త్రిగుణములు | ....... | 11 |
| 2. | భక్తి శ్రద్ధలు | ....... | 13 |
| 3. | శ్రద్ధామయుడు | ....... | 15 |
| 4. | సాత్త్వికము | ....... | 17 |
| 5. | శాస్త్రవిధి | ....... | 20 |
| 6. | అసుర స్వభావము | ....... | 22 |
| 7. | స్వభావము | ....... | 24 |
| 8. | సాత్వికాహారము | ....... | 25 |
| 9. | రజోగుణ దోషము | ....... | 28 |
| 10. | తమోగుణ లక్షణములు | ....... | 30 |
| 11. | సాత్త్విక యజ్ఞము | ....... | 32 |
| 12. | రాజస దానము | ....... | 34 |
| 13. | తామస కార్యము | ....... | 36 |
| 14. | శారీరిక తపస్సు | ....... | 38 |
| 15. | వాఙ్మయ తపస్సు | ....... | 42 |
| 16. | మానసిక తపస్సు | ....... | 45 |
| 17. | సాత్త్విక తపస్సు | ....... | 48 |
| 18. | రాజసికములు | ....... | 50 |

| | | | |
|---|---|---|---|
| 19. | తామసికములు | ....... | 52 |
| 20. | సాత్త్విక దానము | ....... | 54 |
| 21. | రాజస దానము | ....... | 56 |
| 22. | తామస దానము | ....... | 58 |
| 23. | ఓం - తత్ - సత్ | ....... | 60 |
| 24. | ఓం | ....... | 62 |
| 25. | తత్ | ....... | 64 |
| 26. | సత్ | ....... | 66 |
| 27. | బ్రహ్మము | ....... | 68 |
| 28. | శ్రద్ధావంతులు | ....... | 70 |

# ముందుమాట

శ్రద్ధాత్రయ విభాగ యోగము 17వ అధ్యాయముగ గీత యందేర్పడుట ఒక విచిత్రము. ఇందొక హెచ్చరిక యున్నది. అది శ్రద్ధాగుణము యొక్క ఆవశ్యకత. మోక్ష సన్యాస యోగమునకు పూర్వము హెచ్చరికగా, భగవానుడు శ్రద్ధయొక్క ప్రాముఖ్యతను ప్రస్ఫుటముగ తెలిపినాడు.

శ్రద్ధలేని వానికి ఇహపర సౌఖ్యము లేదు. శ్రద్ధ లేని మానవులు యజ్ఞములు చేసినను, దానములు చేసినను, తపస్సులు చేసినను ఆత్మతృప్తి కలుగదు. సంతోష ముండదు అని ఖచ్చితముగ తెలిపెను. శ్రద్ధ లేనపుడు భక్తి జ్ఞాన వైరాగ్యములు కలుగవు. దైవముతో యోగ ముండదు.

శ్రద్ధ కలుగవలెనన్నచో సత్వగుణము నాశ్రయించవలెనని, రజస్తమస్సులను విసర్జించవలెనని, సత్వమున నుండి, శ్రద్ధతో నిర్వర్తించునపుడే ఏ కార్యమైనను సిద్ధించునని, సిద్ధికి సత్యమే మూల గుణమని తెలిపెను. రజోగుణము, తమోగుణము గలవారు చేయు సత్కర్మలు, యజ్ఞము, దానము, తపస్సు ఎట్లుండునో కూడ ఉదహ రించెను. సమస్త సాధనలకు శ్రద్ధయే పునాదిరాయి అని నిశ్చయముగ తెలిపెను. మానవుని పురోగతికి శ్రద్ధ ఆలంబనమై యున్నదని

పలికెను. శ్రద్ధాళువులు ఈ అధ్యాయమును పునః పరిశీలించుకొన వలసినదిగ 17వ అధ్యాయము ఏర్పడి యున్నది.

అందరికిని శ్రద్ధ, ఓర్పు, నేర్పు, మౌనము ప్రసాదించవలెనని భగవానుని ప్రార్థిస్తూ, ఈ వివరణము సమర్పణము గావించు చున్నాను.

ఈ ముద్రణమును సమర్పించిన **శ్రీ బి.సత్యనారాయణరాజు కుటుంబమునకు** గీతాచార్యుని ఆశీస్సులు. ధనిష్ఠ కార్యవర్గమునకు కృతజ్ఞతలు.

విశాఖపట్నం
18-06-2022

ఇట్లు
**పార్వతీకుమార్**

1

## త్రిగుణములు

*అర్జున ఉవాచ :*

**యే శాస్త్రవిధి ముత్సృజ్య యజంతే శ్రద్ధయాన్వితాః ।**
**తేషాం నిష్ఠా తు కా కృష్ణ సత్త్వమాహో రజస్తమః ॥ 1**

*తాత్పర్యము :* ఓ శ్రీకృష్ణా! శ్రద్ధతో కూడినవారు, శాస్త్రోక్త విధానమును అనుసరింపలేనివారు ఎట్టి స్థితియందుందురు? వారి స్థితి సాత్త్వికమా, రాజసమా లేక తామసమా?

*వివరణము :* భగవద్భక్తి జనించుట భగవదనుగ్రహముననే కలుగును. శాస్త్రాధ్యయనము, శాస్త్ర విధానము అనుసరించువారెల్ల భక్తిపరులు కానక్కరలేదు. భక్తిపరులు పండితులు కానక్కర లేదు. శాస్త్రము తెలియనంత మాత్రమున, మనము శాస్త్రోక్తముగ జీవించి నంత మాత్రమున, శాస్త్రము ననుసరించినంత మాత్రమున భక్తి కలుగునని భావించుట అజ్ఞానము. భక్తి కలిగినవారికి శాస్త్రముతో సంబంధము లేకయే భగవదనుభూతి కలుగును. భగవత్ స్పర్శ వలన, ప్రేరణవలన భగవద్భక్తి అంకురించును. అంకురించిన

భక్తి మూడు గుణములలో నుండి కూడ వృద్ధి చెందును. ఒక ఆటవికుని యందు భక్తి అంకురించవచ్చును. ఒక వేటగాని యందు భక్తి అంకురించవచ్చును. ఒక సామాన్యుని యందు కూడ భగవద్భక్తి అంకురించవచ్చును.

ఒక జీవునియందు భక్తి అంకురించినపుడు అతని గుణములనుబట్టి భక్తివికాస ముండును. ఇట్టి భక్తికి శాస్త్రముతో పనిలేదు. శాస్త్రములు ఉపకరణములే కాని భక్తికి మూల కారణము కాదు. భక్తిలేని పూజారు లెందరో ఉన్నారు. యజ్ఞ యాగాదులు కూడ చేయువారున్నారు. వారికి శాస్త్ర విధానమే ప్రధానము. సద్భక్తులు దైవమే ప్రధానముగ భావించి ఆరాధించు చుండగ, వారియందలి త్రిగుణములు కారణముగ, ఆ భక్తి తమోభక్తిగను, రజోభక్తిగను, సత్వభక్తిగను తారసిల్లును. ప్రకటింప బడుచున్న భక్తి తమోగుణ ప్రధానముగ నున్నదా, రజోగుణ ప్రధానముగ నున్నదా, సత్వగుణ ప్రధానముగ నున్నదా అనునది ఇచట ప్రశ్నింపబడుచున్నది.

## 2

# భక్తి శ్రద్ధలు

*శ్రీభగవా నువాచ :*

**త్రివిధా భవతి శ్రద్ధా దేహినాం సా స్వభావజా ।**
**సాత్త్వికీ రాజసీ చైవ తామసీ చేతి తాం శృణు ॥ 2**

*తాత్పర్యము :* జీవుని భక్తి అతని స్వభావముచే తామసికము, రాజసికము, సాత్త్వికముగ వెలువడుచుండును. తదను గుణమైన శ్రద్ధను ప్రకటించును అని భగవానుడు వచించినాడు.

*వివరణము :* జీవు లందరును త్రిగుణములకు లోబడి యుందురు. కొందరియందు తామసికము మెండుగ నుండ వచ్చును. మరికొందరి యందు రాజసము మెండుగ నుండవచ్చును. అట్లే కొందరియందు సాత్త్వికము మెండుగ నుండవచ్చును. ఈ హెచ్చుతగ్గులు జన్మ సంస్కారముచే ఏర్పడియున్నవి. వారి భక్తి శ్రద్ధలు కూడ గుణములు బట్టియే యుండును. కొందరికి అశ్రద్ధ, నిర్లక్ష్యము, బద్ధకము ఉండవచ్చును. మరికొందరికి ఆడంబరము, హడావిడి, త్వరపడుట యుండవచ్చును. మరికొందరు నిర్మలము,

సామాన్యము అగు స్వభావము కలిగి యుండవచ్చును. అట్టివారి శ్రద్ధ, భక్తి వారి గుణములకు లోబడియుండును. జీవులలో భక్తి శ్రద్ధలు వారి గుణములకు లోబడియుండుటచే అనుభూతి కూడ వానిని అనుసరించి యుండును. మూడు విధములగు గుణములు మనుష్యుని యందుండగ, తదనురూపమగు శ్రద్ధయే వ్యక్తమగును గాని, మరియొక విధముగ నుండదు.

జీవుని స్వభావము అతని అంతఃకరణమున బలీయముగ నుండుటచే, మరియొక విధముగ వర్తించుటకు వీలుపడదు. అంతఃకరణములను శుద్ధి చేసుకొనుట వలన శ్రద్ధలో మార్పులు సంభవించు అవకాశమున్నది. మూడు రకముల శ్రద్ధ మూడు గుణముల నుండి ప్రకటింపబడు చుండును. దానిని వివరించు టయే ఈ అధ్యాయము యొక్క ప్రధాన ప్రయోజనము. వానిని వివరించుటకే భగవానుడు ఈ అధ్యాయమున పూనుకొనెను.

## 3

## శ్రద్ధామయుడు

**సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత ।**
**శ్రద్ధామయోఽ యం పురుషో యో యచ్ఛ్రద్ధస్స ఏవ సః ॥3**

*తాత్పర్యము :* సత్త్వగుణ అనురూపమే సర్వవిధముల "శ్రద్ధ" అని తెలియుము. శ్రద్ధామయుడైన పురుషుడు శ్రద్ధయే అగుచున్నాడు.

*వివరణము :* ముందు శ్లోకములలో భగవద్భక్తి భగవదనుగ్రహమున కలుగునని తెలుపబడినది. భగవదనుగ్రహము కలిగిన జీవుడు అప్పటికే త్రిగుణాత్మకుడగుట వలన, అతని భక్తి తామసిక భక్తిగను, రాజస భక్తిగను, సాత్త్విక భక్తిగను ప్రకటింపబడుట సహజము. అట్టి సమయమున శాస్త్రవిధిని అనుసరించుట, అనుసరించకపోవుట కూడ సహజమే. రజస్తమస్సులు అధికముగ నున్న చోట శాస్త్రవిధిని అనుసరించకపోవుటయే ఎక్కువగ జరుగును. కనుక భక్తియందు శ్రద్ధ మూడు పోకడలుగ కనిపించును. శ్రద్ధ లేమివలన భక్తికి రజస్తమస్సులు సోకి అసుర భక్తియై నిలచును. భక్తియున్నను శ్రద్ధతో, పెద్దలవలన విధి విధానము లెరిగి భక్తుడు సత్త్వగుణ అనురూపమును పొందుటకు ప్రయత్నింపవలెను.

సత్త్వగుణ అనురూపమగు శ్రద్ధయే నిజమగు శ్రద్ధయని తెలియవలెను. సత్త్వగుణమే లోపించినపుడు అశ్రద్ధకు ద్వారములు తెరచినట్లగును. భక్తికి, శ్రద్ధ అనునది రాజమార్గము. అశ్రద్ధ అనునది అపాయకరము. కనుకనే భక్తిశ్రద్ధలను జోడించి పలుకుదురు. శ్రద్ధలేని భక్తికి అనేక తార్కాణములు కలవు. ఎందరో భక్తులు అహంకారము వలన, మమకారము వలన పురోగతి చెందక, తమనుతాము బంధించుకొనిన సందర్భము లున్నవి. రజస్తమములు ప్రకోపము చెందినపుడెల్ల నిర్మలమగు సత్త్వమునకు హాని కలుగును. కనుక భగవద్భక్తుడు ఎప్పటికప్పుడు తనయందలి శ్రద్ధ యొక్క పోకడలను గుర్తించుచు నుండవలెను.

సత్త్వ అనురూపమగు శ్రద్ధ యున్నవాడు అన్ని విషయములందు శ్రద్ధగనే యుండును. కొన్ని విషయములందు శ్రద్ధ, మరికొన్ని విషయము లందశ్రద్ధ అట్టి వానికుండదు. "సర్వస్య శ్రద్ధా భవతి" అని శ్లోకమున తెలుపబడినది. కనుక సర్వకాల సర్వావస్థల యందును శ్రద్ధయందుండువాడు, శ్రద్ధయే తానుగ నిలచును. అతడు శ్రద్ధామయుడగును. శ్రద్ధయే అతనిగ మూర్తీభవించును. అట్టి శ్రద్ధ సత్త్వగుణ అనురూపముగ నుండును.

శ్రద్ధ గలవాడు క్రమముగ పెద్దలకడ విధి విధానము నెరుగును. శాస్త్రమును, ధర్మమును కూడ ఎరుగును. ఇది సహజమగు పురోగతి. ఈ తరువాతి శ్లోకములలో శ్రద్ధయొక్క వివిధ పోకడలను భగవానుడు వివరించును.

4

## సాత్త్వికము

**యజంతే సాత్త్వికా దేవాన్ యక్షరక్షాంసి రాజసాః ।**
**ప్రేతాన్ భూతగణాంశ్చాన్యే యజంతే తామసా జనాః ॥ 4**

*తాత్పర్యము :* సత్త్వగుణము కలవారు దేవతలను, రజోగుణము కలవారు యక్షులను రాక్షసులను, తమోగుణము గలవారు భూత ప్రేత గణములను పూజింతురు.

*వివరణము :* సాత్త్వికమగు రూపము, గుణముగల దేవతల నారాధించుట సత్వగుణమును పెంచును. సత్వగుణము గలవారు సహజముగనే సాత్త్విక రూపములకు ఆకర్షింపబడుదురు. శాంతమైన ఆకారము, నీలమగు దేహము, బంగారు కాంతి వస్త్రములు, వికసించిన ముఖము, పెదవులపై చిరునవ్వు, సన్నని నడుము, విశాల వక్షస్థలము, పద్మములవంటి కన్నులు, హస్తములు ఇత్యాది శుభలక్షణములు గలిగిన రూపములే సాత్త్వికులు ఆరాధింతురు. శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, సుబ్రహ్మణ్యస్వామి, గణపతి, లక్ష్మి, అభయ మిచ్చు ఆది దంపతులు ఇత్యాది శుభంకరమగు రూపములను ఆరాధించుటలో అంతరార్థ మొకటియే. ఇట్టి సాత్త్విక రూపములను ఆరాధించుట వలన భక్తులలో సత్త్వముపెరుగును.

అట్లుకాక ఉగ్ర నారసింహరూపము, వీరాంజనేయ రూపము, భద్రకాళి ఇత్యాది రూపముల నారాధించినచో భక్తులందు రజస్సు పెరుగును. అట్లే ఎఱ్ఱని కాంతి రూపములను ఆరాధించిన కూడ రజస్సు పెరుగును. దుర్గను పూజించినను శాంతదుర్గనే పూజింప వలెను. ఉపాసించు దైవము రూపము అందముగను, సుకుమారముగను, ప్రసన్నముగను, కాంతివంతముగను ఉండ వలెనేగాని, ఉగ్రరూపమును పూజించుట వర్జనీయము. దేవతల రూపములు సామాన్యముగ సత్త్వగుణ ప్రధానమై యుండును. కనుక సాత్త్వికగుణము పొందుటకై, సాత్త్విక రూపమునే ఆరాధింప వలెను.

యక్షుల రూపములు, రాక్షసుల రూపములు సామాన్యముగ భక్తులు ఉపాసించరు. తీవ్రమైన కోరికలు గలవారే యక్ష రక్షస్సు లను, ఉగ్రరూపములను ఆరాధింతురు. కోరికలను తీర్చుకొనుటకై అనేకానేక రూపములను ఆరాధించు సంప్రదాయ మున్నది. ఇట్టి వారందరు తెలియకయే రజోగుణమును ఉపాసించుచు నుందురు. పశుబలి, నరబలి, రక్తము చిందించుట- ఉపాసనలలో నేటికిని సాగుచున్నవి. ఇట్టి ఆరాధన వలన సాధకునిలో హింసా ప్రవృత్తి పెరుగుచు నుండును. మాంత్రికులు, తాంత్రికులు ఈ మార్గమున కొంతకాలము ప్రకోపించి అటుపైన నశింతురు.

రజోగుణము వలననే భక్తి సాధనయందు, నిత్య జీవితమందు ఆడంబర మధికమగును. మితిమీరి ప్రచారము చేసుకొనుట

యుండును. నిజమునకు భక్తి ప్రచారము కూడ రజోగుణదోషమే. నేటి మత కలహములు, పోరాటములు, హింస రజోగుణ ప్రేరితు లైన భక్తులవలన సాగుచునున్నవి. రజోగుణ దోషము వలన సంఘమున అశాంతి కలుగుచు నుండును.

తమోగుణము అధికముగ నున్నచోట భూత ప్రేత పిశాచము లను ఆరాధించుట జరుగుచుండును. ఇట్టి వానివలన తమకు, సంఘమునకు హాని కలుగుచుండును. కనుక సత్వగుణ అను రూపములను నిత్యము ఆడంబరము లేక, భక్తితో పూజించుకొనుట ఒకటియే మార్గము. శాస్త్రవిధి అట్లే నిర్దేశించును.

## 5

## శాస్త్రవిధి

**అశాస్త్రవిహితం ఘోరం తప్యంతే యే తపో జనాః ।**
**దంభాహంకార సంయుక్తాః కామరాగ బలాన్వితాః ॥ 5**

*తాత్పర్యము :* ఘోరమగు తపస్సు, దర్పముతో కూడిన ఆరాధన, అహంకార మమకారములతో చేయు ఆరాధన, రాగ ద్వేషములతోను, కామక్రోధములతోను చేయుపూజ అశాస్త్రీయ ములు.

*వివరణము :* శాస్త్రవిధి ననుసరించనివారు, రజస్ తమస్సులకు లోనగుదురు. కనుక భక్తి కార్యములందు కూడ ఆ రజస్ తమస్సులే పనిచేయుచుండును. అట్టి కారణమున చేయు పనులయందు, భక్తి కార్యములందు కూడ ఎక్కువ తక్కువ లుండును. ఎక్కువ తక్కువలు కార్యమందు జరిగినపుడు పర్యవసానములు ఏర్పడి, బంధము లేర్పడును. కనుక పూజాది కార్యక్రమములు కూడ బంధమోచమునకు ఉపాయములు కాకుండ యున్నవి. జీవప్రజ్ఞకు ప్రశాంతత యుండదు. భక్తులమని చెప్పుకొను వారెందరో అమితమగు అశాంతికి గురియగుటకు

ప్రధాన కారణమిదియే. శాస్త్రవిధి ననుసరించుట శ్రద్ధకు తార్కాణము. అట్టి విధి సత్త్వమును పెంచును. సత్త్వమున నున్నపుడు ఏ కార్యము నందైనను హెచ్చుతగ్గు లుండవు. పొరపాట్లు జరుగవు. మరపు ఉండదు. శాంతముండును. చికాకు, కోపము ఇత్యాదివి దరిచేరవు.

శాస్త్రవిధి ననుసరింపనపుడు భక్తునికి దంభము, దర్పము ఆవరించవచ్చును. అహంకారము కొండంత వృద్ధి చెందవచ్చును. కామములు పెరుగవచ్చును. మమకారము బలమై నిలువ వచ్చును. భగవద్భక్తి కలిగినవారు అనునిత్యము పై తెలిపిన అవ గుణములు తమలో కలుగుచున్నవేమో అనునిత్యము పరిశీలించు కొనవలెను.

ఘోరమైన తపస్సులు, దీర్ఘమగు పూజలు, భక్తి కార్యములు కూడ వర్జనీయము అని భగవానుడు పలుకుచున్నాడు.

## 6

## అసుర స్వభావము

**కర్శయంత శ్శరీరస్థం భూతగ్రామ మచేతసః ।**
**మాం చైవాంత శ్శరీరస్థం తాన్విద్ధ్యాసుర నిశ్చయాన్ ॥ 6**

*తాత్పర్యము :* భక్తి, యోగ, వైరాగ్య సాధన పేరిట శరీరమును శుష్కింపజేయువారు, అతిగా శ్రమపెట్టువారు నిశ్చయముగ అసుర స్వభావము కలవారని తెలుసుకొనుము. వారి శరీరమందు అంతర్యామిగ నే నున్నానని తెలియనివారు.

*వివరణము :* మానవ శరీరమందు జీవునితోపాటు ఈశ్వరుడు కూడ ఉన్నాడని తెలియక, శరీరము తమదే అని భావించి, దానిని భక్తి సాధనలపేర కష్టపెట్టువా రనేకు లున్నారు. దేహము దేవాలయమని, అందు ఈశ్వరుడు ప్రతిష్ఠింపబడియున్నాడని, ఈశ్వర ప్రతిమయే తాను అని తెలియక, కర్మేంద్రియములను, జ్ఞానేంద్రియములను, పంచభూతములను, మనస్సును దుర్వినియోగము చేయుచు, శ్రమించుచు శుష్కింపజేయువారెందరో గలరు. దేహమునకు సవ్యమగు పోషణ చేయరు. సమగ్రమగు ఆహారమివ్వరు. శుచిత్వముపై శ్రద్ధ ఉండదు. ఇది

యంతయు భగవంతుని కొరకు చేయు సాధనలో అప్రధానమని భావింతురు. రాక్షసులవలె తమ శరీరమును తామే కష్టపెట్టుకొను చుందురు. మితిమీరిన పూజలు, జాగరణలు, ఉపవాసములు, నిప్పులపై నడచుట, తమ శరీరమును ఉన్మాదముతో తామే రక్తము చిందునట్లుగ బాదుకొనుట- ఇట్టి వికారము లెన్నియో భక్తి పేరున చెల్లుబాటగు చున్నవి. తైల సంస్కారము చేయక, గడ్డములు, మీసములు పెంచి, వికృతమగు వస్త్రధారణము గావించుకొనుచు, ఫాలభాగమంతయు రకరకములుగ కుంకుమ తోను, భస్మములతోను తీర్చిదిద్దుకొనుట కూడ ఈ తరగతికి చెందినవే.

దైవమిచ్చిన దేహమును శ్రద్ధతో పోషించుట సత్త్వగుణ శ్రద్ధ. వికారములన్నియు అసుర సంపత్తి. శ్రీకృష్ణుడందించిన యోగ మార్గమున ఎట్టి వికారములకు తావులేదు. సహజముగ యుండుటయే ప్రధానము. అందరిలో తానొకడుగ కనిపించు వాడు యోగికాని ప్రత్యేకముగ గోచరించవలెనని తహ తహ లాడువాడు ఆడంబరుడే. అట్టివాడు గర్వికూడ. వీరందరును రజస్సు తమస్సు గుణములకు లొంగుట వలన సమత్వము కోల్పోయి, వికారాకారములతో గోచరించుచు నుందురు. వీనిని చూచి మోహపడువారు కూడ అట్టి గుణములు గలవారే.

## 7

## స్వభావము

**ఆహార స్త్వపి సర్వస్య త్రివిధో భవతి ప్రియః ।**
**యజ్ఞ స్తప స్తథా దానం తేషాం భేద మిమం శృణు ॥ 7**

*తాత్పర్యము :* జీవులకు ఆహారమందు ప్రీతి మూడు విధములుగ నున్నది. అట్లే యజ్ఞము, దానము, తపస్సునందు ప్రీతిగూడ మూడు విధములుగ నున్నది. కారణము మూడు గుణములే.

*వివరణము :* జీవుడు త్రిగుణములకు లోనై జీవించుట వలన అందేగుణము అధికముగ వర్తించునో, తదనుగుణమగు ప్రీతి పొందుచు నుండును. అది ఆహారమైనను, యజ్ఞమైనను, దానమైనను, తపస్సైనను గుణమునకు లోబడే నిర్వర్తింపబడు చుండును. వీనిని తెలుసుకొనుటలో సాధకునకు తానేగుణము నకు లోబడియున్నాడో తెలుసుకొన వీలగును. తనయందలి స్వభావము రజస్ తమస్సులతో కూడినదా? లేక సత్వ అను రూపమున తెలుసుకొనుట వలన తన స్వభావమునందు సర్దు బాట్లు చేసుకొనవచ్చును. అందువలన మూడు గుణముల ప్రభావము ఆహార విషయమునందుగాని, యజ్ఞము, దానము, తపస్సులందుగాని, ఎట్లుండునో భగవానుడు వివరించు చున్నాడు.

8

## సాత్వికాహారము

**ఆయు స్సత్త్వ బలారోగ్య సుఖ ప్రీతివివర్ధనాః ।**
**రస్యాః స్నిగ్ధాః స్థిరా హృద్యా ఆహారాః సాత్త్విక ప్రియాః ॥ 8**

*తాత్పర్యము :* రసము గలవి, చమురు గలవి, దేహమందు దీర్ఘ కాలముండునవి, జిహ్వాకు రుచి, మనసునకు ప్రీతి కలిగించు ఆహారములు సాత్వికమగు ఆహారములు. వీని వలన మనో బలము, దేహబలము, సౌఖ్యము, జీవితమందు ప్రీతి వృద్ధి యగును.

*వివరణము :* ఆహారపు అలవాట్లను బట్టి జీవుడు ఏ గుణముచే అధికముగ పాలింపబడుచున్నాడో తెలుపబడుచున్నది. అన్నము పరబ్రహ్మ స్వరూపమని, అన్నము ఎడల నిరసన భావము ఉండరాదని, అన్నము విసర్జించరాదని, అన్నము పంచవలెనని వేదము ఘోషించు చున్నది. అన్నమందలి శ్రద్ధ ప్రధానమగు విషయముగ బోధింపబడు చున్నది. అన్నమునందలి అశ్రద్ధ

ప్రమాదకరము. ఆహార స్వీకరణమునకు ఉపక్రమించుట మొదలుగ ఆహారము యందు చూపు భక్తి శ్రద్ధలు తెలుపబడు చున్నవి. మన సంప్రదాయమున ఆహారము స్వీకరించక పూర్వము పాద, హస్తములను శుచిగా ఏర్పరచుకొనుట, ముఖమును శుభ్రపరచుకొనుట, శ్రద్ధతో ఆహారముగొనుట, ఆహారముయందు దృష్టి పరిపూర్ణముగ నుంచుట- ఇత్యాదివన్నియు తెలుపబడినవి. ఆహారము స్వీకరించు విధానమునకు గూడ ప్రాధాన్య మీయ బడినది. భోజనాలయమునకు ప్రత్యేక శుచి, శుభ్రత యుండెడిది. ఆహారము గూడ భగవదర్పితముగ భుజించుట యుండెడిది. ఇవి యన్నియు సత్త్వగుణ ప్రేరితములు.

అంతేగాక ఆహారము రస్యముగను, స్నిగ్ధముగను యుండ వలెను. అనగా ఆహారములో ద్రవముండవలెను. అనగా పులుసు, రసము, పాయసము, మజ్జిగ ఇత్యాదివి. ఆహారము స్నిగ్ధమై యుండలెను. అనగా నేయి, నూనె సమృద్ధిగ వాడబడవలెను. దీనివలన ఆయుర్వృద్ధి కలుగును. మరియు ఆహారము స్థిరము, బలము కలిగింపవలెను. అనగా పప్పు దినుసులు, కూరలు, ఆకు కూరలు, దుంపలు వినియోగింపబడవలెను. స్వీకరించిన ఆహారము కారణముగ కనీసము రెండు జాములు (ఆరు గంటలు) దేహమున సత్తువ కలిగి యుండవలెను. ఆహారము హృద్యమై యుండవలెను. మనసున కిష్టమైనపుడు ఆహారము గొనుటకు జీవుడు ఉత్సహించును. భోజనమునకు ఉత్సాహము ప్రధాన

లక్షణము. ఉత్సాహము లేక భుజించుట సాత్త్విక గుణము కాదు. ఆహారము ప్రియముగ నుండుట, ఆహారమందు ప్రీతి సమృద్ధిగ నుండుట, భోజన అనంతరము దేహమున సుఖముండుట కూడ సత్వగుణ లక్షణము. పచనము చేయబడిన ఆహారము వెను వెంటనే గొనుట కూడ సత్త్వగుణ లక్షణములు. చద్ది పనికిరాదు.

పై నియమములు పాటించునపుడు బలము, ఆరోగ్యము, ఆయుష్షు, జీవితమందు ప్రీతి వృద్ధి యగును. సత్త్వగుణ మాశించిన వారు మొట్టమొదటగ ఆహారము విషయమున మిక్కిలి శ్రద్ధ వహించవలెను. మనిషి శ్రద్ధ ఆహారమందు గమనింప వచ్చును.

రహదారిపై భుజించుట, బజారులో భుజించుట, నిలబడి భుజించుట, అటునిటు తిరుగుచు భుజించుట వర్జనీయములు.

## 9

## రజోగుణ దోషము

**కట్వామ్ల లవణాత్యుష్ణ తీక్ష్ణ రూక్ష విదాహినః ।**
**ఆహారా రాజన స్యేష్టా దుఃఖశోకామయప్రదాః ॥ 9**

*తాత్పర్యము :* రజోగుణ మధికముగ నున్నపుడు చేదు, పులుపు, ఉప్పు, కారము, వేడి, ఎండిన పదార్థము, దాహము కలిగించునవి- ఇత్యాది ఆహార పదార్థములందు ప్రీతి ఎక్కువగ నుండును. దీనివలన దేహము దుఃఖమయము, శోకమయము అగు మనస్సును పొందును.

*వివరణము :* చేదు, పులుపు, ఉప్పు, కారము, ఎండిపోయిన పదార్థములు, దాహము కలిగించు పదార్థములు రజోగుణదోషము చేత ప్రీతిగ గోచరించును. తీవ్రమగు రుచిగల పదార్థములు రజస్సును పెంచును. శరీరమందు ఆందోళన యుండును. మనసు అధికముగ పరుగులెత్తు చుండును. అనారోగ్యమునకు యిట్టి రుచులు గల ఆహారము దోహదము కలిగించును. వేగముగ భుజించుట కూడ రజోగుణదోషము. ఆహారము స్వీకరించు

విషయమున తొందర పడరాదు. నిదానము ప్రధానము. అతి వేగము అపాయకరము. అట్లే మిక్కిలి వేడిగానున్న పదార్థము భుజింపరాదు. నాలుకకు వేడిమి సౌకర్యముగ నుండవలెను గాని అసౌకర్యముగ నుండరాదు.

పై విషయములను గుర్తించి, తదనుగుణముగ ఆహార స్వీకరణ విషయమున మార్పులు గొనివచ్చినచో తరచు అనారోగ్యము కలుగుట నివారింపబడును.

## 10

## తమోగుణ లక్షణములు

**యాతయామం గతరసం పూతి పర్యుషితం చ యత్ ।**
**ఉచ్ఛిష్టమపి చామేధ్యం భోజనం తామసప్రియమ్ ॥ 10**

*తాత్పర్యము :* వండిన పిమ్మట జాముదాటిన ఆహారము, సారము నశించిన ఆహారము, సువాసన లేని ఆహారము, ఒకరాత్రి గడిచిన పిదప నిల్వ ఉంచిన ఆహారము, చక్కగా వండని ఆహారము, అపరిశుభ్రముగ గోచరించు ఆహారము, ఒకరు తినగా మిగిలిన ఆహారము తమోగుణ లక్షణములు కలిగియుండును. భక్తులు, యోగ సాధకులు వీనిని వర్జించవలెను.

*వివరణము :* శుచిగా వండిన అన్నము జాములోపల భుజింప వలెనని ఆర్య సంప్రదాయము. జాము అనగా మూడు గంటలు. వండి ఫ్రిజ్‌లో పెట్టుకొని, దపదపాలుగ దానిని భుజించుట నిశ్చయముగ అనారోగ్యకరము. అశేషముగ అనేకానేకమగు అనారోగ్యముల కిదే పునాది. వారము రోజుల వరకు సరిపడ వండి ఫ్రిజ్‌లలో దాచుకొనుచు తినుట దౌర్భాగ్యము. దీనివలన శరీరమున కెంతయో హాని కలుగును. ఫ్రిజ్‌లో దాచుకొనుట, మైక్రోవేవ్‌లలో వెచ్చజేసుకొనుట సౌకర్యమే అయినను ప్రకృతి

విరుద్ధములు. ఆధునిక మానవుడు ఈ ప్రాథమిక సూత్రమును మరచి తమో గుణమున పడుచున్నాడు.

సారహీనమగు భోజనము చేయరాదు. ఎండిపోయినవి, పులిసిపోయినవి, రుచిమారినవి ఎంత విలువైన పదార్థమైనను విసర్జించవలెను. ఆహారమందలి రసము అనగా నూనె, నెయ్యి, పాకము యిత్యాదివి నశించినపుడు అట్టి ఆహారము హాని కలిగించును.

వండిన ప్రతి ఆహారము దాని దగు గంధమొకటి కలిగి యుండును. అది పోయిన వెనుక దుర్గంధ మావరించును. భుజించు ఆహారము వాసన చూచుట వలన ఇది తెలియగలదు. వాసన చూడక భుజింపరాదు.

భగవత్ ప్రసాదము తప్ప ఏదియు ఎంగిలి చేసినది తినరాదు. దానివలన అంతకుముందు భుజించినవారి వాసనలు వీరి కంటును. అట్లే మాడినవి, పాచిపట్టినవి అగు ఆహారము నుండి కొంత శుభ్రమైన ఆహారము సేకరించి, స్వీకరించరాదు.

పై తెలిపిన ఆహారములను ఇష్టపడుట తమోగుణము అధికముగ నున్నపుడే జరుగును. ఇట్టి ఆహారమును స్వీకరించుట వలన తమోగుణ మధికమై, వివేకము నశించును.

## 11

## సాత్త్విక యజ్ఞము

**అఫలాకాంక్షిభి ర్యజ్ఞో విధిదృష్టో య ఇజ్యతే ।**
**యష్టవ్యమే వేతి మనస్సమాధాయ స సాత్త్వికః ॥ 11**

*తాత్పర్యము :* ఫలాపేక్ష లేక, మనసునకు తోచిన పరోప కారము నిర్వర్తించుట సాత్త్విక యజ్ఞము.

*వివరణ :* యజ్ఞ మనగా ఫలాపేక్ష ఆశించక చేయు పరహిత కార్యము. ఇది ఉత్తమోత్తమగు యజ్ఞము. పరహితమే పరమధర్మ మనునది ఆర్ష సంప్రదాయమున అనాదిగ నున్న ధర్మము. అంతర్మనస్సు నందు ఉపకారము చేయుమని ప్రోద్బలము కలవాడే పరహితమునకు పూనుకొనును. అది ఆత్మ ప్రబోధము. దానిని వెనువెంటనే నిర్వర్తించువాడు తరించును. ఆత్మ ప్రబోధము కలుగగానే లౌకికమగు మనస్సు, బుద్ధి, అహంకారము స్వభావమును బట్టి అడ్డు తగలవచ్చును. ప్రతిఫలాపేక్ష కలుగ వచ్చును. తననుండి ఉపకారము పొందినవాని నుండి ఏమి ఆశించినను అది ప్రతిఫలాపేక్షయే అగును. విధేయత, కృతజ్ఞతా భావము, సహకారము ఇత్యాదివి ఆసించి ఉపకారము చేసినపుడు

అది సాత్త్విక కార్యము కాదు. సూర్యచంద్రాదులు, గ్రహములు, పంచభూతములు, దిక్పాలకులు, ఇతర దేవతలు చేయు కార్యము లన్నియు పరహితమే. వారేమియు ఆశించకయే హితము కూర్చు చున్నారు. అట్లే వృక్షములు, జంతువులు, ఖనిజములు వినియోగ పడు చున్నవి.

ఫలమాశించి పనిచేయువాడు మానవుడొక్కడే. కనుకనే అతనికి చిక్కులెక్కువ. మనసు ప్రధానముగ జీవించువాడు మానవుడు గనుక, మనసు లోక వ్యవహారములకు అలవాటుపడి యుండుటచే అంతశ్చేతనయందు కలిగిన ప్రబోధమునకు అడ్డు తగులును. బుద్ధిగా అహంకారము కూడ తోడు రాగా ఆత్మ ప్రబోధము పొంగివచ్చినను చల్లబడిపోవు చుండును. అట్లుగాక, ఇది చేయదగిన పనియే అని అనిపించినపుడు చేయుటయే సత్యము. శిబిచక్రవర్తి, బలిచక్రవర్తి ఇట్టి సాత్త్విక స్థితి యందుండు టచే ఆచంద్రార్కము కీర్తిమంతులైనారు. శ్రేష్ఠులై నిలబడినారు. ఇట్టి పరోపకారము శాస్త్ర సమ్మతమని తెలియవలెను. అది సాత్త్విక గుణమని కూడ తెలియవలెను.

## 12

## రాజస దానము

**అభిసంధాయ తు ఫలం దంభార్థమపి చైవ యత్ ।**
**ఇజ్యతే భరత శ్రేష్ఠ తం యజ్ఞం విద్ధి రాజసమ్ ॥ 12**

*తాత్పర్యము :* ఫలము నాశించి, దంభముతో చేయు పరోప కారము రాజస దానముగ తెలుసుకొనుము.

*వివరణము :* పేరు ప్రఖ్యాతుల కోసము, ప్రచారము కోసము, డాంబికముగ చేయు దానము రాజసదానముగ తెలుప బడినది. యజ్ఞము, దానము చేయువారు సహజముగ పొందెడి ఫలము చిత్తశుద్ధి. చిత్తశుద్ధి లేనిచోట ఆత్మ తత్త్వము ప్రకాశించదు. ఆత్మానుభూతి కలుగదు. పరోపకారము పొందువాని యందు దైవమును దర్శించి, భక్తిశ్రద్ధలతో దానము చేయుట శాస్త్ర విధానము. అట్లు చేయుట వలననే బలిచక్రవర్తి ఆత్మానుభూతి పొందెను. స్వీకరించు వానియందు దైవమును దర్శించుచు దానము చేయుట, కృతజ్ఞతా భావము కలిగియుండుట ముఖ్యము. స్వీకరించువాడే లేనపుడు దానమెట్లు చేయగలము. దానగ్రహీత

యందు దైవమును దర్శించుచు దానము చేసినచో దాత అనుభూతి విశిష్టముగ నుండును. గొప్పదనము కోసము దానము చేయువానికి ఈ దృష్టి ఉండదు. దాన గ్రహీతయందు తేలిక భావముండును. తనను గూర్చి దంభముండును. తానే దానము చేయుచున్నాననే అహంభావము వలన ఆత్మానుభావము కలుగదు. నిజమునకు పరోపకారము చేయు సంకల్పము దివ్య సంకల్పమై, దాతయందు ప్రవేశించి గ్రహీతకు సంక్రమించును. దాత, గ్రహీతకూడ సంతుష్టి చెందుదురు. దాత దంభముతో, ఆడంబరముతో, గర్వముతో దానమిచ్చినపుడు అతడు ఆత్మ సంతుష్టుడు కాలేక అసంతృప్తితో నిలచిపోవును. దానధర్మాదులు చేయుచు దుఃఖపడు వారున్నారు. దానికి కారణము దానఫలము నందు ఆసక్తియే. రాజసికదానము లన్నియు దాతలకు తగినంత సంతుష్టినీయక, పరిశ్రమను మాత్రమే మిగుల్చును. దాన మెప్పుడును దాతయందలి దైవమును దర్శించుచు నిర్వర్తించ వలెను. అపుడే ఆనందము కలుగును. చిత్తశుద్ధి కూడ కలుగును. చిత్తశుద్ధి లేని దానము వృథా శ్రమయే అని తెలియవలెను.

## 13

## తామస కార్యము

**విధిహీన మసృష్టాన్నం మంత్రహీన మదక్షిణమ్ ।**
**శ్రద్ధావిరహితం యజ్ఞం తామసం పరిచక్షతే ॥ 13**

*తాత్పర్యము :* బొత్తిగా శ్రద్ధలేనిది, అన్నదానము లేనిది, దక్షిణ లేనిది, మంత్ర రహితమగు యజ్ఞము తామస కార్యమని తెలియవలెను.

*వివరణము :* శ్రద్ధలేని పరోపకారము వృథా. అట్టి కార్యమునకు ఎవ్వరునూ సంతృప్తి చెందరు. అట్లే దక్షిణ లేని దానము కూడ. దానము దక్షిణతో కూడి యుండవలెను. అదే విధముగ ఒక సామూహిక కార్యము నిర్వర్తించిన పిదప అన్నదానము వుండవలెను. అన్నదానము లేని హితకార్యము సిద్ధించదు. భారతీయ సంప్రదాయమున అన్నదానమునకు అత్యంత ప్రాధాన్యత ఈయబడినది. తరచు అన్నదానములు చేయుట హితకార్యములలో భాగమై యున్నది. ప్రతి సాంఘిక కార్యమునకు అన్నదానము ఫలశ్రుతిగ తెలుపబడినది. మృష్టాన్న భోజనము వలన మానవులు, దేవతలు, పితృదేవతలు తృప్తి చెందుచు నుందురు. ప్రతి ఘనకార్యమునకు మృష్టాన్న భోజనము విధింపబడినది. అన్న

దానమే లేనపుడు నిర్వర్తించిన కార్యమునకు తమోగుణ దోష మంటి, ఆనందము లేక దుఃఖమును కలిగించును.

శాస్త్రవిధి ననుసరించక, సొంత తెలివితో నిర్వర్తించు యజ్ఞము కూడ తామసమే. అట్టి యజ్ఞమువలన దుఃఖమే కలుగును.

తామస గుణము అధికముగ నున్నపుడు దానధర్మములు సుఖానుభూతి నీయవు. అట్టివారు అన్నము పెట్టినను, దక్షిణ ఇచ్చినను, యజ్ఞ యాగాదులు చేసినను దుఃఖమేగాని సుఖము కలుగదు. తామసులకు శ్రద్ధ తక్కువ. విధి విధానము ననుస రించరు. స్వతంత్ర బుద్ధితో పాటు శ్రద్ధ కరువగుట వలన పరోప కారము ద్వారా దుఃఖము కొనితెచ్చుకొందురు. ఇట్టివారు మొట్ట మొదటగా నేర్వవలసినది శ్రద్ధ. అది పెద్దల సాన్నిధ్యముననే లభ్య మగును. త్వరపడి పరోపకార కార్యములను తలపెట్టరాదు. ప్రస్తుతకాలమున సేవయందు, పరోపకారమందు ఆసక్తి ఇనుమ డించుచు నున్నది. కాని తగిన శ్రద్ధ లేకపోవుట వలన ఇట్టి కార్యములు అనుభూతినీయక వికటించుచున్నవి.

## 14

## శారీరిక తపస్సు

**దేవ ద్విజ గురు ప్రాజ్ఞ పూజనం శౌచ మార్జవమ్ ।**
**బ్రహ్మచర్య మహింసా చ శరీరం తప ఉచ్యతే ॥ 14**

తాత్పర్యము : దేవతలను, బ్రహ్మవేత్తలను, గురువులను, జ్ఞానులను పూజించుట, లోపల బయట శుచిగ నుండుట, ఋజు ప్రవర్తనము కలిగి యుండుట, ఎవరిని హింసించకుండుట, బ్రహ్మము నందు చరించు వ్రతమును పాలించుట శారీరిక తపస్సుగ తెలియవలెను.

వివరణము : ఈ శ్లోకమునందు, తరువాత రెండు శ్లోకము లందు దైవసాధకులకు మూడు విధములైన తపస్సులను భగవానుడు వివరించెను. ఈ శ్లోకమున శారీరిక తపస్సు గూర్చి నాలుగు సాధనలు చెప్పబడినవి.

1. దేవతలను, గురువులను, పెద్దలను, బ్రాహ్మణులను పూజించుట అభ్యాసము కావలెను. వీనివలన వినయము పెరుగును. అహంకారము తగ్గును. ఆశీర్వచనము లభించును. నిత్యము దేవతాపూజ గావించుట దేవతానుగ్రహమునకు కారణము. గురువును పూజించుట వలన ఆత్మతత్త్వ మెరుగుట

కవకాశముండును. ద్విజులనగా మరల పుట్టినవారు. అట్టివారు దైవసమానులు. వారిని సేవించుట వలన మార్గము సుగమమై యుండును. అట్లే ప్రాజ్ఞులు అనగా తెలిసినవారు. వారిని కూడ వీలువెంబడి సేవించవలెను, పూజించవలెను. పై తెలిపిన నాలుగు తరగతులవారు సమాజమునందు పూజ్యులు. అవకాశము లభించునపుడెల్లా వారిని సేవించుట, పూజించుట, శుశ్రూష చేయుట శ్రద్ధకు తార్కాణము.

పూజించుటకు, సేవించుటకు, శుశ్రూష చేయుటకు శరీరము సహకరించవలెను. అట్లు శరీరమును సంసిద్ధము చేయుటలో శరీరమునకు సాత్త్విక స్వభావము కలుగును. లేనిచో తమస్సుగాని, రజస్సుగాని అంటవచ్చు. అహంభావము పెరగవచ్చును. మార్గము అట్టి స్థితిలో దుర్గమ మగును. కనుకనే పూజనము, సేవనము గురుశిష్య మార్గమున మరియు భక్తి మార్గమున ప్రధానముగ బోధింపబడినవి. కరచరణాదులు, వాక్కు, ఇంద్రియములు దివ్యకార్యములకు సమర్పింపబడుట వలన కొంత సాత్త్వికత శరీరమున కబ్బును.

2. లోపల బయట శుచిగనుండుట మరియొక సాధనము. దివ్యత్వము చేరువగుటకు శుచి, శుభ్రత ప్రధానము. కావున నిత్యము పాదములు, హస్తములు కడుగుకొనుట, కన్నులు నీటితో కడుగుకొనుట, శరీరము వాసన లేకుండ, అవసరమగుచో పలు పర్యాయములు స్నానము చేయుట ఇత్యాదివి బాహ్యమగు శుచి నిచ్చును. అంతరంగ శుచికై నిత్యము మనసున నామస్మరణము చేయుట, కాంతి దర్శనమునకై ప్రయత్నించుట చేయవలెను.

అట్లు చేసినపుడు అశుచియగు శోకము, మోహము, కామము, క్రోధము, మదము, మాత్సర్యము, లోభము, భయము ఇత్యాది భావములు దరిచేరవు. ఇట్టివి దరిచేరునపుడు నామస్మరణము, దివ్యరూప దర్శనము ప్రయత్నపూర్వకముగ కొనితెచ్చుకొనుట శ్రద్ధ. అంతఃశుచి పొందుటకు భక్తియే ప్రధానము. అట్టి భక్తివలన ఏర్పడు కాంతి అసుర భావములను చేరనీయవు.

3. హింసాబుద్ధిని విడనాడుట నిజమగు శ్రద్ధకు తార్కాణము. ఏ ప్రాణినైనను హింసించుట అసుర ప్రవృత్తి. హింస వలన అన్ని ధర్మములు చెడిపోవును. అహింస పరమధర్మము. శరీరముతోగాని, వాక్కుతోగాని, ప్రవర్తనతోగాని ఎవ్వరిని హింసించరాదు. హింసించువారు శ్రద్ధకు ఆమడ దూరమందున్నట్లే. అహింసను గూర్చి తెలియని వారుండరు. దాని నాచరణమున పెట్టినవారు మహిమాన్వితమగు మార్గమున తప్పక ప్రవేశింతురు.

4. బ్రహ్మచర్యము : బ్రహ్మచర్యమనగా బ్రహ్మము నందు చరించుట. ఇది మానసికము. శారీరిక తపస్సునందు చెప్పబడిన ఈ బ్రహ్మచర్యము స్త్రీ పురుష ఆకర్షణమునకు సంబంధించినది. స్త్రీలకు పురుషులయందు,పురుషులకు స్త్రీలయందు శారీరికమగు ఆకర్షణ సహజము. దానిని నియమించుటకే వివాహ ధర్మమేర్పడినది. స్త్రీకి పురుషుని యందుగాని, పురుషునికి స్త్రీ యందుగాని కలుగు ఆకర్షణము వివాహ క్రతువు ద్వారా పరిమితము చేయబడుట వలన జీవులు నిస్సందేహముగ సంస్కరింపబడుచున్నారు. సంస్కారము కోరు మానవులు ఈ నియమమందలి విలువ తెలిసి వర్తించి, శ్రద్ధాళువులై ముందుకు సాగుచున్నారు.

శారీరికమగు ఆకర్షణ పశుప్రాయము. జీవులు శరీర ధారులగుటచే సహజముగ వారినడుమ ఆకర్షణ ఏర్పడుచు నుండును. వివాహ నియమములను పాటించునపుడు స్త్రీ పురుషు లిరువురును శారీరిక ఆకర్షణల నుండి మానసిక ఆకర్షణలకు క్రమముగ ఉద్ధరింప బడదురు. పర స్త్రీలయందు, పర పురుషులయందు ఆకర్షణ చెందువారు ప్రజ్ఞాపరముగ పతనము చెందినవారే. ఏకపత్నీవ్రతము, అట్లే ఏకపతీవ్రతము శారీరిక తపస్సుగ భావించి, జీవిత ఆసాంతము నిర్వర్తించుకొనుట శ్రద్ధాపరమగు శారీరిక తపస్సు. ఏ జాతియందు ఇట్టి స్త్రీ పురుషులుందురో ఆ జాతి ఉన్నతమగు జాతిగ తెలియబడుచున్నది. అట్టి జాతియందు పరపురుషులు, పరస్త్రీలు అను భావముండక, తన భాగస్వామి తప్ప ఇతరులందరు సోదర సోదరీమణులే. వికృతమగు కామ భావము లుండవు. ప్రస్తుతమున నామ మాత్రముగనైనను భరత భూమియందే ఈ విలువ గౌరవింపబడుచున్నది. కనుకనే భరత భూమియందు శతాబ్దమునకు పదిమందియైనను మానవులు మహనీయులగు చున్నారు. ఇతర జాతులలో వీరిశాతము అతి తక్కువ. ఏ సమాజమందు స్త్రీ పవిత్రమూర్తిగ ఆదరింపబడునో ఆ సమాజమే రక్షింపబడును. ఇది సత్యము. బ్రహ్మచర్యము శరీరిక తపస్సులో ఉత్తమ స్థానమున నిలిచియున్నది.

15

## వాఙ్మయ తపస్సు

**అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్ ।**
**స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే ॥ 15**

*తాత్పర్యము :* ఉద్వేగము లేని భాషణము, సత్యము ప్రియము హితము అగు భాషణము వాఙ్మయ తపస్సుగా చెప్ప బడుచున్నది. అట్లే స్వాధ్యాయము అభ్యసించుట కూడ వాఙ్మయ తపస్సుగ చెప్పబడుచున్నది.

*వివరణము :* వాక్కు, వాఙ్మయము సాధకుని ఉద్ధరించును. వీనియందు శ్రద్ధ అవసరము. వాక్కు నుచ్చరించునపుడు ఉచ్చ రించువానికి, వినువానికి ఉద్ధారణ కలుగవలెనుగాని ఉద్వేగము కలుగరాదు. ఉద్వేగము కలతబారిన ప్రజ్ఞ. వాక్కు తేటనీరువలె నిర్మలమై యుండవలెను. పలుకువానికి, వినువానికి కూడ ఆనందము కలిగించవలెను. వాక్కు సత్యమై యుండవలెను. ప్రియముగ నుండవలెను. హితము కలిగించునట్లుగా నుండవలెను.

వాక్కునందు దూషణము వర్జనీయము. విమర్శ పనికిరాదు.

ఇతరులను గూర్చిన అభిప్రాయములు కూడ వర్జనీయమే. ఈర్ష్య అసూయతో కూడిన భాషణము ప్రజ్ఞను కలుషితము చేయును.

సత్యము పలుకునపుడు కూడ ప్రియముగ పలుకవలెను. అప్రియమగు సత్యము పలుకరాదు. సత్యము, ప్రియము, హితము, అనుద్వేగకరము అని నాలుగు గుణములు వాక్కునందుండ వలెనని ఇచ్చట తెలుపబడుచున్నది. ఇందు అనుద్వేగకరమనగా ఉద్వేగము కలిగించని భాషణము. అరిషడ్వర్గములు ఉద్వేగము కలిగించును. అట్టి సమయమున మౌనము నాశ్రయించవలెను. కామము, క్రోధ పూరితమగు భాషణము, మోహము లోభముతో కూడిన భాషణము, ఈర్ష్య అసూయతో కూడిన భాషణము, మదము మాత్సర్యముతో కూడిన భాషణము ఉద్వేగము కలిగించును. ఉద్వేగముతో భాషించునపుడెల్ల, పలుకువారికి వినువారికి కూడ ప్రజ్ఞ చెదరును. బురదనీరువలె నిరుపయోగమై యుండును. శ్రద్ధా వంతులు వాక్కు నియమములను స్వీకరించి, తపస్సుగా నిర్వర్తించు కొనవలెను. ఈ తపస్సు నందు సిద్ధి కలుగనివారు వృద్ధి చెందరు. గురుకులములలో శారీరిక తపస్సుతో పాటు, వాఙ్మయ తపస్సును కూడ నిర్వర్తింప జేయుదురు.

వాఙ్మయ తపస్సునందు వాక్కునకు శిక్షణ ఇచ్చుటయేగాక స్వాధ్యాయము కూడ అభ్యసింప చేయుదురు. వేదోచ్చారణము, గీతా పారాయణము, భాగవత పద్యముల కీర్తనము, రామాయ

ణము, అందున సుందరకాండ, బాల రామాయణము, ఉపనిషత్తుల అధ్యయనము, మంత్రజపము స్వాధ్యాయమునకై ఋషులు, పెద్దలు ఏర్పరచిరి. నిత్యము స్వాధ్యాయము చేయువారు ప్రజ్ఞను నిర్మలము గావించుకొందురు. దీనివలన మేధస్సు మెఱుపు వలె పనిచేయును. శ్రద్ధ కలవారు నిత్యము వాక్కును, స్వాధ్యాయ మును పరిశీలించుకొనుచు పురోగతి సాధించవలెను. మానవుని ఉన్నతికి గాని, పతనమునకు గాని వాక్కు, వాఙ్మయమే కారణమై యున్నది. వాక్కును జయించినవారు లోకమును నియమింప గలరు. మన ఋషులు, మహర్షు లట్టివారు.

16

## మానసిక తపస్సు

**మనఃప్రసాద స్సౌమ్యత్వం మౌన మాత్మ వినిగ్రహః ।**
**భావసంశుద్ధి రిత్యేత త్తపో మానస ముచ్యతే ॥ 16**

*తాత్పర్యము :* మనసును నిర్మలముగ నుంచుకొనుట, సౌమ్యముగ నుంచుకొనుట, మౌనము నభ్యసించుట, ఆత్మభావన యందు నిలుపుట, భావ సంశుద్ధి కలిగి యుండుట మానసిక తపస్సుగ చెప్పబడుచున్నది.

*వివరణము :* ప్రసాదమగు మనస్సు అనగా దివ్యత్వముచే స్పృశింపబడిన మనసు అని అర్థము. దైనందిన ప్రార్థనలు, ధ్యానములు, స్మరణము, గోష్ఠి ఇత్యాదివి నిత్యము జరుగు చున్నప్పుడు దివ్యస్పర్శ కలిగి, మనసుకు ప్రసాద స్థితి కలుగును. ప్రసాదమనగా దైవముచే స్పృశింపబడినది. నిత్య ప్రార్థనల వలన ఇట్టి స్థితిని పొందుట కవకాశమున్నది.

సౌమ్యమగు మనసు పొందుటకు భగవత్ కథలను, భగవ ద్భక్తుల కథలను నిత్యము అధ్యయనము చేయుచు నుండవలెను. ఇట్లు చేయుట వలన క్రూరభావము లన్నియు నశించి సౌమ్యత్వ మేర్పడును. ముఖము ప్రసన్నముగ నుండును.

వాచక తపస్సు వలన సౌమ్యము, ప్రసాదము అగు మనసు వలన సహజముగ మౌన మేర్పడును. అట్టి మనస్సు సహజమగు భావ పరంపరలకు అనువుగ నుండును. అధికమగు వేగము, అల్ప మగు వేగము ఉండక కాలమును, దేశమును బట్టి కలుగవలసిన భావములు కలుగుచు నుండును. త్వరపడుట గాని, పొరపడుట గాని, మరపుగాని లేక అప్రమత్తమై ప్రశాంతతతో కూడి యుండును.

భగవత్ చింతన శ్వాస, స్పందనాదులతో కూడియుండుటకు భావముల నరికట్టవలసిన శ్రమ యుండదు. ధ్యానము పేరున, ఆత్మ నిగ్రహము పేరున శ్రమ పడుట యుండదు. ప్రజ్ఞను నిగ్రహించు ప్రయత్నము లుండవు. దైవ సంకల్పము మేరకు ప్రజ్ఞ మనసు నుండి, ఇంద్రియములు శరీరము ఇత్యాది కక్ష్యలలోనికి నిర్మలముగ ప్రవహించును. దేహమున అన్ని కక్ష్యలయందు ప్రజ్ఞా విలాసమే యుండును గాని ఒడుదొడుకు లుండవు. ప్రాణము, ప్రజ్ఞ నిర్మల నదీ ప్రవాహమువలె వర్తించు చుండగ, దేహమున వసించుట సుఖముగను ఆనందముగను ఉండును. దేహమొక బంధమై కాక, సౌకర్యమై నిలచును. ఇట్లేర్పడుటకు శారీరిక, వాఙ్మయ, మనోమయ తపస్సులు శ్రద్ధాళువులై నిర్వర్తించుకొనువారు నిజమగు సాత్త్వికులు. వారిని శ్రద్ధయే రక్షించును. పోషించును. అనుభూతినిచ్చును.

ఆధునిక కాలమున భక్తి సాధన పేరున, సాధకు లనేకానేక విధమగు త్రిప్పటలకు గురియగు చున్నారు. మనసు, ఇంద్రియ

ములు, వాక్కు, కర్మేంద్రియములు శ్రద్ధవలననే సమన్వయించుకొనవచ్చును. శ్రద్ధలేనిచోట ఒకదాని కొకటి ఒడబడక ప్రజ్ఞ వికలము చెందుచు నుండును. ప్రాణము సంకటపడుచు నుండును. శ్రద్ధలేని వారికి జీవితమే సంకటములతో కూడియుండును. ఆత్మజ్ఞానమనునది ఎండమావి వంటిది.

17

## సాత్త్విక తపస్సు

శ్రద్ధయా పరయాతప్తం తపస్త త్త్రివిధం నరైః ।
అఫలాకాంక్షిభి ర్యుక్తై స్సాత్త్వికం పరిచక్షతే ॥ 17

*తాత్పర్యము :* పై తెలిపిన మూడు విధములగు తపస్సు నిర్మల చిత్తముతో ఫలాపేక్ష లేక శ్రద్ధగా నిర్వర్తించుకొనుట సాత్త్విక తపస్సుగా తెలియబడుచున్నది.

*వివరణము :* భగవద్గీత అంతయు నిష్కామ కర్మము, కర్మ ఫల త్యాగములను మాటిమాటికిని గుర్తుచేయుచు నుండును. ఫలితము లాసించి పనిచేయువారు భగవద్గీతకు ఆమడదూరము. కర్మ నిర్వహణమునందే ఆనందమున్నదిగాని ఫలాసక్తియందు కాదు. ఫలములు నెల జీతమువలె వచ్చుచు, పోవుచు నుండును. పని నిత్య ముండును. చేయుచున్న పనియందు ఆనందము చెందుటయే గీత సూచించు సూక్ష్మధర్మము. పనియందు ఆనందము పొందువాడు, పనియందే నిమగ్నమగును. అట్టి వానికి త్రికరణశుద్ధి మెండుగ నుండును. ఫలాసక్తి గలవారు పనియం దాసక్తి అంతంత మాత్రముగనే చూపుదురు. వారికి త్రికరణశుద్ధి కరువై, శ్రద్ధ కరువై పనిలో అవకతవక లుండును.

చక్కగ చదువుకొను విద్యార్థికి విద్యయందాసక్తి యుండ వలెను గాని, మార్కులయందు కాదు గదా! పనియందు పూర్ణ శ్రద్ధ ఏర్పడినపుడు ఫలముల యం దాసక్తి యుండదు. ఇది సత్యము. ఫలములయం దాసక్తి గలవారు పనియందానందము పొందలేరు. ఇట్టివారు పనిని శ్రద్ధగ నిర్వర్తించలేరు. అందువలన ఫలాసక్తివీడి పనియందే నిమగ్నమైనపుడు అట్టి పని ఆనందము నిచ్చును. శ్రద్ధగ, ఏకోన్ముఖముగ నిర్వర్తించుట జరుగును. చిత్తము ఏకోన్ముఖ మగుటయే చిత్తశుద్ధి. చిత్తశుద్ధి యున్నచోట జీవుడు సంస్కరింపబడును. జీవులకు ప్రకృతి పని కల్పించుటలో గల ఉద్దేశ్యమిదియే. త్రికరణశుద్ధిగ ఆచరించిన పనులు జీవుని సంస్కరించును. చిత్తశుద్ధి లేనపుడు ఎన్ని కార్యములు చేసినను జీవికి సంస్కారము వీలుపడదు. సంస్కరింపబడిన జీవుడు ఆనంద స్వరూపుడై జీవితము ననుభవించును.

ఈ సృష్టి మొత్తము ధర్మక్షేత్రముగను, కురుక్షేత్రముగను ఏర్పరచుటలోగల ఆంతర్యమిదియే. పై తెలిపిన మూడు విధము లగు తపస్సులు ఫలాపేక్షలేక శ్రద్ధతో నిర్వర్తించుకొనువారు సత్త్వమున స్థిరపడి సుఖింతురు. కనుక సాధకులు శారీరిక వాఙ్మయ మనో తపస్సులను శ్రద్ధతో నిర్వర్తించుకొనవలెను.

## 18

## రాజసికములు

**సత్కార మాన పూజార్థం తపో దంభేన చైవ యత్ ।**
**క్రియతే తదిహ ప్రోక్తం రాజసం చల మధ్రువమ్ ॥ 18**

తాత్పర్యము : సత్కరింపబడవలెనని, గౌరవింపబడవలెనని, డంబాచారమునకై కార్యములు చేయువారు, తపస్సులు చేయువారు, దానములు చేయువారు రాజసికమగు మనస్సు కలవారు. వారు చేయు పనులకు ఫలము లస్థిరములై యుండును.

వివరణము : ఈ శ్లోకమునకు వివరణము ఆవశ్యము కాదు. ప్రపంచమున చేయు దానధర్మాది కార్యములు, పూజాది క్రతువులు, యాగములు అన్నియును రాజస దోషము కలిగి ఫలమాసించుచు చేయునవే. సత్కరింపబడవలెనని, పూజింపబడ వలెనని, బిరుదులు వగైరా పొందవలెనని, పేరు ప్రతిష్ఠలు కలుగవలెనని, డంబముతో చేయు యజ్ఞము, దానము, తపస్సు వలన పొందు ఫలము లస్థిరములు. అవి రాజసికములు.

ఏ పని చేసినను కీర్తిని కోరువారు కలరు. ఇట్టివారు సమాజమున ఎప్పుడునూ ఉందురు. వీరికి చేసిన సత్కారముల

వలన అచలము, ధృవము అగు మనసు కలుగదు. చంచల మతులై భయభ్రాంతులతో జీవించుచు నుందురు. సనాతన ధర్మమున యజ్ఞము, దానము, తపస్సు ఎంత గుప్తముగను, క్లుప్తముగను (అనగా ప్రచారము చేయక) చేసిన అంత ఫల ముండునని తెలిపిరి. కాని కలి ధర్మముగ ప్రతి చిన్న కార్యమునకు ఫోటోలు తీసుకొనుచు, సర్వవిధముల ప్రపంచమునకు తెలియ జేయువారు మెండుగ నున్నారు. వీరుచేయు యజ్ఞమైనను, దానమైనను, తపస్సయినను వార్త కోసమేగాని ఆత్మానుభూతి కొరకు కాదు. ఫలాపేక్ష మెండుగ నుండుటచే పరోపకారఫలము దక్కక, సంతృప్తి లేక ఆందోళన చెందుచు, జీవించు చుందురు.

19

## తామసికములు

**మూఢగ్రాహేణాత్మనో యత్పీడయా క్రియతే తపః ।**
**పరస్యోత్సాదనార్థం వా తత్తామస ముదాహృతమ్ ॥ 19**

*తాత్పర్యము :* మూర్ఖపు పట్టుదలతో తనను తాను బాధ పెట్టుకొనువాడు గాని, ఇతరులను బాధపెట్టువాడు గాని తామసిక ప్రవృత్తి కలవాడు. ఇట్టివాడు చేయు యజ్ఞము, దానము, తపస్సు తామసికమని తెలియవలెను.

*వివరణము :* తమోగుణము అధికముగ నున్నచోట కార్యములయందు శ్రమ గోచరించును. సృష్టియందు ఏ కార్యమున కైనను పరిశ్రమ అవసరమే అయినను, అధికశ్రమ, అదనపు శ్రమ ప్రకృతి నిర్దేశించ లేదు. ప్రత్యేకించి దైవకార్యముల యందు, యోగమునందు ఇది అనావశ్యకము. ప్రకృతి కర్మను నిర్వర్తించ మని తెలిపినదేగాని కష్టపడమని తెలుపలేదు. ఎంతటి మహత్కార్యమైనను నిపుణతతో చేయువారు అధిక శ్రమ పడరు. కౌశలము కుశలము నిచ్చును. కౌశలము లేనిచోట శ్రమ యుండును. అధిక శ్రమ తెలియనితనముననే కలుగును.

ఏ పని ఎట్లు చేయవలెనో తెలిసి చేసినపుడు చేయుటలో పీడ యుండదు. ఎక్కువ శ్రమ పడినచో దేవుడు మెచ్చునని భావించు మూర్ఖత తమోగుణ ప్రభావమున ఏర్పడును. భక్తి కార్యములయందు తమను తాము హింసించుకొనువారు కూడ కలరు. నిప్పులపై నడచుట, ముళ్ళతీగలతో తమను తాము బాదుకొనుట, అధికముగ ఉపవాసము లుండుట వివేకము లేని పనులుగ గుర్తించవలెను. తమనుతాము హింసించుకొను కార్య మేదియైనను అజ్ఞాన పూరితము.

అట్లే పట్టుదలతో ఇతరులను బాధించుట కూడ. శ్రద్ధ తమోగుణముతో కూడినపుడు ఇట్టి ప్రమాదము సంభవించు అవకాశము మెండుగ నున్నది.

యజ్ఞము, దానము, తపస్సు నిర్వర్తించువారు తమనుగాని ఇతరులను గాని హింసించుట వర్జనీయము. దాని వలన విపరీత ఫలములు ఏర్పడి బాధించును.

## 20

## సాత్త్విక దానము

**దాతవ్య మితి యద్దానం దీయతేఽనుపకారిణే ।**
**దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్త్వికం స్మృతమ్ ॥ 20**

*తాత్పర్యము :* ఏ దానమైతే తప్పక ఈయవలసినదే అని అంతరంగమున తోచునో, ఏ దానమైతే ఎట్టి ప్రత్యుపకారము చేయలేనివారి కీయబడునో, ఏ దానమైతే పుణ్యకాలమందు, పుణ్య దేశమందు పాత్రత నెరిగి ఈయబడునో, అట్టి దానము సాత్త్విక దానమని తెలియ బడుచున్నది.

*వివరణము :* దానమునకు కొన్ని ముఖ్యమగు సూచనలు భగవానుడే తెలిపియున్నాడు. అవి ఈ విధముగ నున్నవి.

1. అంతర్మనస్సు నందు నిశ్చయముగ "ఈ దానము చేయ వలెను" అని అనిపించవలెను. సందేహము, సందిగ్ధముతో కాక పూర్ణమగు మనస్సుతో చేయవలె ననిపించుట ఆత్మ ప్రబోధ లక్షణము.

2. దానము పుచ్చుకొనువారి నుండి ఎట్టి ప్రత్యుపకారము ఆశించరాదు. కనుక ప్రత్యుపకారము చేయలేని వానికి దాన మిచ్చుట శ్రేష్ఠము.

3. దానగ్రహీత పాత్రత కలిగి యుండవలెను. యోగ్యుడై యుండవలెను. అతని అవసరమే అతని యోగ్యతను కూడ నిర్ణయించును. యోగ్యతను బట్టియే దానము చేసిన వానికి, పొందిన వానికి నిష్కారణమగు సంతోషము కలుగును.

4. పుణ్య ప్రదేశములందు, తీర్థములయందు, దేవాలయ ప్రాంతమందు, ఆశ్రమాదులందు పైతెలిపిన సూచనలను పాటించుచు దానమిచ్చినచో ఆనందము అధికమై యుండును. ఎక్కడ దైవచింతన జరుగునో, దైవకార్యములు జరుగునో, అచట చేరిన వారికి దానముచేయుట శ్రేష్ఠమని తెలియవలెను.

5. పుణ్యతిథులయందు అనగా సంక్రమణము, పూర్ణిమ, అమావాస్య, ఏకాదశి ఇత్యాది తిథులయందు దానము చేయుట శ్రేష్ఠమని తెలుపబడు చున్నది.

ప్రధానమగు సూచన లేమనగా దాతకు, ఇపుడు దానము చేయవలసినదే అని నిశ్చయముగ లోనుండి సంకల్పము బలముగ వచ్చుట. ఆ సమయమున చేసిన దానమునకు కారణము దాతకు కూడ తెలియదు. దాత తనను తాను ప్రశ్నించుకొనినను సమాధాన ముండదు. ఇట్టి దానము అన్ని దానములలోకి శ్రేష్ఠము. ఆ దానమునకు ప్రేరణ భగవత్ సంకల్పము. క్షణకాలమున భావము కలిగి, ఆచరింపబడును. దీనినే పెద్దలు వాసుదేవ ప్రేరితము అని కూడ అందురు.

పై తెలిపిన సూచనలను పాటించుచు దాన మొనర్చిన, అట్టి దానమును సాత్త్విక దానమందురు.

## 21

## రాజస దానము

**యత్తు ప్రత్యుపకారార్థం ఫల ముద్దిశ్య వా పునః ।**
**దీయతే చ పరిక్లిష్టం తద్దానం రాజసం స్మృతమ్ ॥ 21**

*తాత్పర్యము :* ప్రత్యుపకారము కోరి, ఫలము నుద్దేశించి మొగమాటముతో చేయు దానము రాజస దానమని చెప్పబడు చున్నది.

*వివరణము :* కామ్యకర్మ అంతయు రాజసగుణ సంబంధితమే. జీవులు చేయున వన్నియు కామ్యకర్మలే. కామ్య కర్మలయందు ఫలసిద్ధి భావన ప్రధానముగ నుండును. కామమే జీవులను సాధారణముగ నడిపించుచు నుండును. భగవద్గీత కర్తవ్య కర్మలను మాత్రమే నిర్వర్తించమని, కర్తవ్యకర్మ ఫలములతో సంబంధము లేక యుండునని, అదియే కార్యం కర్మ అని, అనగా చేయదగిన పని అని తెలుపును. చేయదగిన పని అనగా కర్తవ్య కర్మ. చేయదలచిన పని, విచక్షణతో విడమరచుకొన వలెనని కూడ తెలుపును. కర్తవ్యము నిర్వర్తించవలసినదే గనుక అందు ఫలాశ లేదు. దీనినే నిష్కామ కర్మ అని కూడ అందురు. ముందు శ్లోకములో

ఎట్టి ప్రత్యుపకారము కోరక ఇచ్చిన దానము సాత్త్విక దానమని దాని నియమములు తెలుపబడినవి.

రాజస గుణమున్న వానికి అన్ని విషయము లందు ఫలము కోరుట సహజము. ఫలమే అతనికి ప్రేరణ నిచ్చును. దాన మిచ్చినను అట్టి వానికి ఫలముండవలెను. ఏ ప్రత్యుపకారము లేక దానమిచ్చుట రజోగుణ సంపత్తి గలవారికి కుదరదు. ఒకవేళ ఇచ్చినను మనసున క్లేశ ముండును. ప్రత్యుపకారార్థముగ గాని, ఫలముగగాని కోరక దానమిచ్చుట రజోగుణికి మనస్కరించదు. కనీస గుర్తింపులేక దానమిచ్చుట అతనికి అర్థవంతముగ తోచదు.

ఇట్టి రజోగుణ ప్రభావముతో చేసిన దానము లన్నియు ఆత్మతృప్తి నీయకపోగ, దాతను బంధించ గలవు. కారణమేమనగ, ఫలము కోరి చేయు దానమే గదా! ఫలము ఆశించినచోట బంధ ముండును.

22

## తామస దానము

**అదేశకాలే యద్దాన మపాత్రేభ్యశ్చ దీయతే ।**
**అసత్కృత మవజ్ఞాతం తత్తామస ముదాహృతమ్ ॥ 22**

*తాత్పర్యము :* పాత్రతను లెక్కచేయక, కాలమును దేశమును లెక్కచేయక, అశ్రద్ధతో సంస్కారహీనముగా చేయు దానము తామస దానమని చెప్పబడుచున్నది.

*వివరణము :* తామస గుణ మావరించినపుడు దేనిని లెక్క చేయకపోవుట అను లక్షణము ప్రధానముగ నుండును. ఇట్టివారు దానమునకు పాత్రతను లెక్కచేయరు. కాలమును లెక్కచేయరు. ప్రదేశమును లెక్కచేయరు. దాన గ్రహీతయందు కనీసపు గౌరవము గూడ యుండదు. తిరస్కార భావముతో దానము చేయుట జరుగును. సంస్కారముండదు. ఇట్టి దానము చేయకుండుట వలన దాతకు క్షేమము. చేయుట వలన దుష్ఫలితము లేర్పడును. తామస గుణము ఎట్టి కార్యమునైనను నిష్ఫలము చేయుటయే గాక, పర్యవసానము లేర్పరచి బంధించును.

ఏ పనియైనను శ్రద్ధ వలన రాణించును. శ్రద్ధ సాత్త్విక

మైనపుడు ఆత్మ సంతుష్టి కలుగును. రాజసికమైనపుడు మనో చాంచల్యము ఏర్పడును. తమోగుణ ప్రధానమైనపుడు జీవునికి అధోగతి కలిగించును. శ్రద్ధ సాత్త్వికమైనపుడు అంతఃకరణ శుద్ధి కలిగి ఆత్మానుభూతి నిచ్చును. అందువలన శ్రద్ధ ఎటువంటి గుణముతో అనుబంధము కలుగునో, ఎటువంటి ఫలము లిచ్చునో ఈ అధ్యాయమున తెలుపబడుతున్నది.

## 23

## ఓం - తత్ - సత్

**ఓం తత్సదితి నిర్దేశో బ్రహ్మణ స్త్రివిధః స్మృతః ।**
**బ్రాహ్మణాస్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా ॥ 23**

తాత్పర్యము : పరబ్రహ్మమునకు 'ఓం' అనియు, 'తత్' అనియు, 'సత్' అనియు మూడు విధముల నామములు అనాదిగ స్మృతి మార్గమున ఋషుల ద్వారా మానవజాతికి అందింపబడినవి. దీనితో అనుసంధానము చెంది వాని ప్రేరణచే వేదములు యజ్ఞములు, విధి విధానము, సనాతన ధర్మ మేర్పరచినది. దీని ననుసరించుట వలన జీవు లుద్ధరింపబడుదురు.

వివరణము : సత్త్వగుణమును కోరువారు శ్రద్ధావంతులై యుండవలెను. ఓంకారము నాశ్రయించవలెను. ఓంకార మనాహత శబ్దము. ఓంకారము నాశ్రయించుట అనగా, మనలో జరుగుచున్న ఓంకారమును వినవలెను. మనలో జరుగు ఓంకారము వినుటకు శ్రద్ధతో శ్వాస నాశ్రయించవలెను. శ్రద్ధ కొనసాగునపుడు స్పందనము వినుట జరుగును. స్పందనము హంసధ్వని చేయుచు నుండును. 'సోహం' అను శబ్దమును వినుట

జరుగును. ఆ శబ్దము నాశ్రయించునపుడు శబ్దమందలి హల్లులు జారిపోయి, 'ఓం' అను ప్రణవనాదము వినపడును. అది పరబ్రహ్మము నుండి వ్యక్తమగును గనుక, పరబ్రహ్మమునకు మనలను తోడ్కొనిపోవును. మూలమునకు 'తత్' అనియు, బ్రహ్మమనియు, సత్యమనియు పేర్లేర్పరచినారు. మూలమగు తత్త్వము నామరూపములకు, నాద వర్ణములకు కూడ అతీతము. అందుండియే అన్నియు దిగివచ్చును. ఇచట బ్రహ్మమనగా చతుర్ముఖ బ్రహ్మ కాదు. సృష్టికర్త కాదు. సృష్టికర్తకు కూడ మూలమైనవాడు. ఈ పరబ్రహ్మము అన్ని నిర్వచనములకు అతీతము. అవగాహనకు కూడ అతీతము. అందిమిడిపోవుటయే జీవునికి పరమావధి. అందుండి మరల దిగివచ్చి ఆ తత్త్వము బోధించువారు మహర్షులు, ఋషులు మున్నగువారు. వారేర్పరచినవే జీవన విధానములు. వారేర్పరచినవే వేదములు, యజ్ఞములు. వారు మరల మరల కాలమును బట్టి, దేశమును బట్టి దిశా నిర్దేశము చేయుదురు. దీనిని అనుసరించువారు సాత్త్వికులు.

## 24

### 'ఓం'

**తస్మా దోమిత్యుదాహృత్య యజ్ఞ దాన తపః క్రియాః ।**
**ప్రవర్తంతే విధానోక్తా స్సతతం బ్రహ్మవాదినామ్ ॥ 24**

తాత్పర్యము : బ్రహ్మవాదులు యజ్ఞము, దానము, తపస్సు మరియు ఎట్టి క్రియయైనను ప్రారంభించునపుడు ఓంకారమును స్మరించియే అనుష్ఠించు చున్నారు.

వివరణము : 'ఓం' అను ప్రణవమునందు బ్రహ్మము ప్రథమముగ వ్యక్తమగును గనుక, ప్రణవము నందలి అ, ఉ, మ త్రిమూర్తులుగను, త్రిశక్తులుగను, అటుపైన బ్రహ్మదండమున త్రిగుణములు గను క్రమముగ అవతరణము చెందుదురు గనుక ప్రణవ స్మరణమున సమస్తము క్రమమై నిలచును. ప్రాణ స్పందనములు గూడ సక్రమమున నిలచును. యజ్ఞ అవతరణము నందు, ప్రాణముల స్పందనమునందు క్రమ మేర్పడినపుడు, సంకల్పింపబడిన భావము సులభముగ అవతరణము చెందును. ఎట్టి లోపములు, దోషములు ఉన్నను అవి సరిదిద్దవలెను. సర్దుబాట్లు జరుపుట వలన భావము, భాష, కర్మ నిర్వహణము పరిపూర్ణత చెందును.

ఇట్లు శ్రద్ధావంతులైనవారు ఓంకార ప్రభావమెరిగి, ఎట్టి కార్యము ప్రారంభమున నైనను ఓంకారమును స్మరింపుడు. బ్రహ్మావాదులే ఇట్లు నిర్వర్తించు చున్నపుడు, శ్రద్ధావంతులు తప్పక ఓంకార స్మరణతో మనోమయము, వాచకము, కాయకము అగు కర్మలు నిర్వర్తించునపుడు ఓంకారమును స్మరించవలెను.

ఉచ్చరించుట నుండి స్మరించుటలోనికి, స్మరించుట నుండి నిత్యము జరుగుచున్న ఓంకారములోనికి ప్రవేశించుట ఉత్తమము. యాంత్రికముగ కంఠముతో పలుకుట నుండి, పై తెలిపిన మూడు స్థితులలోనికి ప్రజ్ఞా ప్రవేశము చేయుట శ్రద్ధకు తార్కాణము. అపుడే చేయు కర్మలన్నియు బ్రహ్మముతో కూడి చేయుట సంభవించును.

25

## 'తత్'

**తదిత్యనభిసంధాయ ఫలం యజ్ఞ తపః క్రియాః ।**
**దానక్రియాశ్చ వివిధాః క్రియంతే మోక్షకాంక్షిభిః ॥ 25**

*తాత్పర్యము :* మోక్షమును కాంక్షించువారు ప్రతిఫలములను కోరక, యజ్ఞము తపస్సు దానము ధర్మము వంటి క్రియలను ఆచరించుచునే యున్నారు. అట్టి సమయములందు సర్వ సమర్పణముగ 'తత్' అను పదమును స్మరించుచునే యున్నారు.

*వివరణము :* సర్వము దైవమే. కర్మలు నిర్వర్తించువారు, ఫలములు పొందువారు ఫలములు, క్రియలు కూడ దైవమే. దైవము కానిది ఏదియు లేదు. కర్త-కర్మ-క్రియ దైవమే అని తెలిసి, దానినే దర్శించుచు జీవించువారు ముముక్షువులు. వారు నిత్యము జీవితమున దైవ దర్శనమునే చేయుచు నుందురు. అట్టి దైవ నామము 'తత్' అనియు, 'సత్' అనియు తెలుపబడినది. దానిని చేరు మార్గము ప్రణవమని కూడ తెలుపబడినది. కనుక నిత్య జీవితమున నిర్వర్తింపబడుచున్న సమస్త కార్యములు దైవమునకే సమర్పణముగ, దైవ స్మరణతో చేయుట ఉపాయముగ

ముముక్షువులు భావించుచు నుందురు. ఇట్టివారు యజ్ఞములు చేసినను, తపస్సులు చేసినను, దానధర్మములు చేసినను, కర్త-కర్మ-క్రియ దైవమని భావించుటయే. వీరికి ఫలములం దాసక్తి యుండదు. తాము నిర్వర్తించు చున్నామన్న భావన యుండదు. సర్వసమర్పణ బుద్ధితో నిర్వర్తించుచు నుందురు. వీరికి తమ యందు కలుగు సంకల్పమూ దైవమే. నిర్వహణము దైవమే. ఫలములు దైవమే. కార్యములందు వీరి శ్రద్ధ అనుపమానము. ఈ అధ్యాయమున ఇట్టి ముముక్షువులను గూర్చి భగవానుడు పలుకుట శ్రద్ధకు పరాకాష్ఠ. ఇట్టి వాని శ్రద్ధ త్రిగుణముల కతీతమై, ఇతరులకు తలమానికమై గోచరించును.

## 26

## 'సత్'

**సద్భావే సాధుభావే చ సదిత్యేత త్ప్రయుజ్యతే ।**
**ప్రశస్తే కర్మణి తథా సచ్ఛబ్దః పార్థ యుజ్యతే ॥ 26**

తాత్పర్యము : సద్భావమునందు, సాధు భావము నందు 'సత్' అను పరబ్రహ్మము యొక్క నామము ప్రయోగింపబడు చున్నది. అట్లే సత్ కర్మములందు కూడ ప్రయోగింపబడు చున్నది. సత్య స్మరణము కలిగిన భావములు, కర్మములు సత్యమునే చేర్చును.

వివరణము : 'తత్' అన్నను, 'సత్' అన్నను శాశ్వతమగు 'ఉనికి'ని తెలుపును. అట్టి ఉనికిని తెలియజేయు భావములు, కార్యములు ఉత్తమములని ఈ శ్లోకమున తెలియజేయబడు చున్నవి. మానవులను భావములు, కార్యములు ప్రధానముగ ఆవరించి యుండును. ఆ భావములు, కార్యములు 'సత్'ను గూర్చి ప్రకటించినవే అయినపుడు అవి శ్రేష్ఠమై యుండును. ఏ పని చేసినను పరమాత్మని ప్రకటించునట్లుగ యుండవలెను. ఏ భావములు నిర్వర్తించినను కూడ పరమాత్మని ప్రకటించు

నట్లుగనే యుండవలెను. భావము, భాష, వర్తనము ఈ మూడును భగవంతుని ప్రకటించునట్లుగ ఎవరు వర్తింతురో, వారే శ్రద్ధ విషయమున శ్రేష్ఠులని తెలియజేయబడు చున్నది. ఇట్లు త్రికరణముల నుండి దైవమే ప్రకటింప బడుచుండుట అత్యంత విశేషము. ఉత్తమ భాగవతులలో మాత్రమే ఇట్టివారు గోచరింతురు. వీరిని అనుసరించువారు కూడ క్రమముగ వీరి స్థితిని పొందగలరు.

27

## బ్రహ్మము

**యజ్ఞే తపసిదానే చ స్థితిః సదితి చోచ్యతే ।**
**కర్మ చైవ తదర్థీయం సదిత్యేవాభిధీయతే ॥ 27**

*తాత్పర్యము :* బ్రహ్మము నుద్దేశించి చేయు యజ్ఞము నందు, తపస్సునందు, దానమునందు, కర్మలయందును బ్రహ్మమే దర్శనమగు చుండును గనుక, ఆ కార్యము లన్నియు సత్యమై నిలచును.

*వివరణము :* బ్రహ్మోపాసన మనగ, బ్రహ్మము నుద్దేశించి బ్రహ్మము ననుభూతి పొందుటకై నిర్వర్తించు కార్యములు. బ్రహ్మార్పణముగ సమస్త కార్యములను నిర్వర్తించుట ఒక నిష్ఠ. ఇట్టి నిష్ఠ వలన సత్యమనుభూతి కలుగును. యజ్ఞము చేసినను, తపస్సు చేసినను, దానము చేసినను, మరి యే ఇతర కర్మలు నిర్వర్తించు చున్నను, బ్రహ్మము నుద్దేశించి చేసినపుడు బ్రహ్మాను భూతి కలుగును. బ్రహ్మానందము కూడ కలుగును. ఇట్టి బ్రహ్మోపాసకుల నిష్ఠ సత్యమునే కూడి యుండును. ఇట్టివారు పరిసరములయందు దేనితో ప్రవర్తించుచున్నను, దానిని బ్రహ్మముగ

దర్శించుచు, వర్తించుచు నుందురు. బ్రహ్మము కొరకై జీవించు చుందురు. బ్రహ్మమునే సేవించుచు నుందురు. బ్రహ్మమునే దర్శించుచు నుందురు. బ్రహ్మ నిష్ఠయందు జీవింతురు. వీరికి పొందవలసిన స్థితియని మరియొకటి యుండదు. సాధనయందే సిద్ధి లభించును. సిద్ధి యందుందురు గనుక సాధన అనెడి మరియొక భావముండదు. వీరి ప్రజ్ఞ సత్యలోకమున విహరించుచు నుండును. అసత్తు వీరిని స్పృశింప లేదు. వీరు వసించునది శాశ్వత సత్యలోకమై యుండును.

28

## శ్రద్ధావంతులు

**అశ్రద్ధయా హుతం దత్తం తపస్తప్తం కృతం చ యత్ ।
అస దిత్యుచ్యతే పార్థ న చ తత్ప్రేత్యనో ఇహ ॥ 28**

తాత్పర్యము : అశ్రద్ధతో చేయబడు కార్య మేదైనను అసత్యమే అగును. హోమమైనను, యజ్ఞమైనను, దానమైనను, తపస్సైనను, మరి ఏ కార్యమైనను శ్రద్ధతో కూడనిచో అసత్యమై నిలచును. అట్టి కార్యములు ఇహమునందుగాని, పరమునందు గాని సుఖము నీయవు.

వివరణము : శ్రద్ధ లేనివానికి సుఖమే లేదు. అందరును సుఖమును కోరుదురుగాని, శ్రద్ధ నాశ్రయించరు. ఎచ్చట శ్రద్ధ యుండునో అచ్చట త్రికరణశుద్ధి యుండును. త్రికరణశుద్ధి గలవానికి ఆత్మప్రేరణ లభించుట సులభము. ఆత్మ ప్రేరణతో చేయు పనులు త్రికరణశుద్ధిగ జరుగుచున్నప్పుడు తృప్తి, సుఖము ఉండును. పనిచేయు చున్నప్పుడే తృప్తి లభించును. అటుపైన కలుగు ఫలములయందు శ్రద్ధ గలవానికి ఆసక్తి యుండదు. ఫలములయందు గాక పనియందు తృప్తియుండుట, పనిచేయు

చున్నపుడు ఆనందముగ నుండుట యుండును. వీరికానందము, సుఖము సద్యోఫలముగ పనియందే లభించును. ఆత్మ సంతుష్టి పనియందు నిరంతరము పొందుచునే యుండును. ప్రకృతి జీవులను ఆనందములో నుంచుటకే త్రిగుణములను, పంచేంద్రియములను, దేహమును ఇచ్చి యజ్ఞార్థము పనిచేయుడని తెలిపెను. ఈ రహస్యమెరిగిన పెద్దలు శ్రద్ధ నాశ్రయించి, త్రికరణములతో కార్యములు నిర్వర్తించుచు, ఇహపరములందు ఆనందముగ నున్నారు.


పనియందలి విశేషము తెలియక, మానవులు ఆనందము పొందలేకున్నారు. కుమ్మరియైనను, వడ్రంగియైనను, చాకలియైనను, దర్జీయైనను, జడ్జీ అయినను, రాజైనను, బంటైనను ఈ రహస్యము తెలిసినవాడే సుఖపడును. మొదటిది ఆత్మప్రేరణ, రెండవది త్రికరణశుద్ధి. ఈ రెంటిని వదలి ఫలములం దాసక్తితో అటునిటు పరుగెత్తుచు, ఆరాటపడుచు, జీవులు సుఖ శాంతులను కోల్పోవుచున్నారు. హోమములు, యజ్ఞములు, దానములు, హిత కార్యములు నిర్వర్తించుచు కూడ దుఃఖించుచు నున్నారు. ఇహమందుగాని, పరమందుగాని శాశ్వతముగ ఆనందముగ నుండుటకు దైవము శ్రద్ధాత్రయ విభాగ యోగమున ఇచ్చిన సూచనలను శ్రద్ధాళువులై పాటించుట నేర్వవలెను. శ్రద్ధ నశ్రద్ధచేసి ఎన్ని ప్రయత్నములు చేసినను, జీవున కెచటను సుఖము లేదు. శ్రద్ధ గలవానికి ఎచట నున్నను తృప్తే. ఏమి చేసినను తృప్తే. ఎందరో మునులు, యోగులు, సిద్ధులు ఈ సత్యము నెరిగి

ఉన్నచోటనే మారుమూలలో నుండిపోయిరి. వారిని దర్శించుటకు లోకులెందరో పనిగట్టుకొని వత్తురుగాని, వారు బోధించు శ్రద్ధను గ్రహింపరు, ఆచరింపరు. ఆచరించినచో వారికి ఇహపరముల యందలి సుఖము సన్నిహితమై యుండును. సుఖమునకై ఆరాటపడక, శ్రద్ధావంతులు కావలెనని భగవానుని ఆకాంక్ష !

*శ్రీమద్భగవద్గీత యందలి 17వ అధ్యాయము*
*'శ్రద్ధాత్రయ విభాగ యోగము' వివరణము*
*సంపూర్ణము.*


# ధనిష్ఠ ప్రచురణలు
















ప్రతులకు : ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.

Phone : 0891-2701531 www.dhanishta.org info@dhanishta.org

భక్తియందు శ్రద్ధ మూడు పోకడలుగ కనిపించును. శ్రద్ధ లేమివలన భక్తికి రజస్తమస్సులు సోకి అసుర భక్తియై నిలచును. భక్తియున్నను శ్రద్ధతో, పెద్దలవలన విధి విధానములెరిగి భక్తుడు సత్త్వగుణ అనురూపమును పొందుటకు ప్రయత్నింపవలెను.

ISBN 978-81-957285-4-1

9 788195 728541 >

ధనిష్ఠ